క్లుప్తంగా

ట్రైసైకిల్ పంపిణీ



ట్రై సైకిల్‌ను అందిస్తున్న దృశ్యం

జి.సిగడాం : బాతువ గ్రామానికి చెందినవైఎస్సార్ సీపీ నాయకుడు బూటు అప్పారావు కృషితో గ్రామానికి చెందిన విభిన్న ప్రతిభావంతుడికి ట్రై సైకిల్ మంజూరు కావడంతో ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ముళ్ల రామమూర్తినాయుడు, రామినాయుడు, మీసాల కన్నంనాయుడు, ఎం.టి.నాయుడు, మహాలక్ష్మినాయుడు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో తమిళనాడు ఎమ్మెల్యే



ఎమ్మెల్యే రాజుకు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో, అర్చకులు

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని తమిళనాడు రాష్ట్రం కోవిల్పట్టి నియోజకవర్గ ఏఐఏడీఎంకే పార్టీ ఎమ్మెల్యే కదంబూర్ రాజు కుటుంబసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో ప్రసాద్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ విశిష్టతను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచి దర్శనంతో పాటు శాస్త్ర ప్రకారం పూజలు చేయించడం బాగుందన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీనివాస్‌కు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న చౌదరి శ్రీనివాస్

గార: జొన్నలపాడు కాలనీకి చెందిన చౌదరి శ్రీనివాస్ ఆధ్యాత్మిక గాన కళా రత్న పురస్కారం అందుకున్నారు. విశాఖపట్నంలోని ప్రతిభ సాంస్కృతిక స్వచ్ఛంద సంస్థ ఆదివారం పౌర గ్రంథాలయంలో మాజీ మేయర్ దాడి సత్యనారాయణ చేతుల మీదుగా ఈ అవార్డును ప్రదానం చేసింది. శ్రీనివాస్ ఆర్ట్ ఆఫ్ లివింగ్ గాయకుడిగా, శ్రీ బృందావనం నిర్వాహకునిగా ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో గుర్తింపు సాధించడంతో ఎంపిక చేసినట్లు వ్యవస్థాపకులు అడవి రాజు తెలిపారు. కార్యక్రమంలో బైపల్లి సోమేష్, దుర్గాప్రసాద్ పండా, విజయ రమణి తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసేవారికి గుర్తింపు



సత్యనారాయణకు ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలుపుతున్న గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: వృత్తినే దైవంగా భావించి విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే తోటి ఉద్యోగుల మన్ననలు పొందిన రాష్ట్ర పన్నుల శాఖ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఇ.వి.సత్యనారాయణ సేవలు అభినందనీయమని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాలులో జె.ఆర్.పురం మాజీ ఎంపీటీసీ ఇ.తిరుపతిరాజు సోదరుడు, డిప్యూటీ కమిషనర్ ఇడదాసుల సత్యనారాయణ ఉద్యోగ విరమణ సందర్భంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, రణస్థలం మండల వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

సిక్కోలు కవులకు తెలుగుతేజం పురస్కారాలు



తెలుగు తేజం పురస్కారాలు అందుకున్న కవులు

శ్రీకాకుళం కల్చరల్: గుంటూరులో ఆదివారం నిర్వహించిన తెలుగు భాషా ఉత్సవాలలో తనతో పాటు నగరానికి చెందిన పలువురు కవులకు తెలుగు తేజం పురస్కారాలతో సత్కరించారని జిల్లా శ్రీశ్రీ కళావేదిక కన్వీనర్ ఉమాకవి తెలిపారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు మణిపాత్రుని నాగేశ్వరరావు, శ్రీశ్రీ కళావేదిక కార్యదర్శి డబ్బీరు గోవిందరావు, వాడాడ శ్రీనివాస్, కిమ్మి సంతోష్, ఐ.ఎస్.డి. ప్రసాద్, తాళ్లూరి విజయలక్ష్మిలు పురస్కారాలు అందుకున్నట్లు చెప్పారు. శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షుడిగా డబ్బీరు గోవిందరావును నియమిస్తున్నట్లు కళావేదిక జాతీయ సీఈవో కత్తిమండ ప్రతాప్, జాతీయ మహిళా అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం, జాతీయ మీడియా ప్రతినిధి బమ్మిడి అమ్మెజీ ప్రకటించారు.

గృహయోగం లేనట్టేనా?

- కూటమి పాలన ఏడాది దాటినా పేదలకు మంజూరు కాని ఇళ్లు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 3256 ఇళ్లు మంజూరు
- అందులో 2283 పూర్తి.. వివిధ నిర్మాణ దశల్లో మిగతా గృహాలు



గత ప్రభుత్వ హయాంలో అల్లినగరంలో నిర్మించిన జగనన్న కాలనీ ఇళ్లు

ఎచ్చెర్ల : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటుతున్నా పేదలకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదు. కొత్త ప్రభుత్వ పాలనలో ఇప్పట్లో గృహయోగం కనిపించడం లేదని అర్హులైన పేదలు నిట్టూరుస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 3,256 మందికి ఇళ్లు మంజూరు చేశారు. అందులో 2,283 ఇళ్లు ఇప్పటికే పూర్తయ్యాయి. మిగతా గృహాలు వివిధ స్థాయిలో నిర్మాణంలో ఉన్నాయి. ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరుకు వీటిని పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది.

హామీలు ఓట్లకోసమేనా..

కూటమి నాయకులు ఎన్నికలకు ముందు 3 సెంట్ల చొప్పున స్థలం, ఇళ్లు మంజూరు చేసి నిర్మించనున్నట్లు హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటుతున్నా ఏ ఒక్కరికీ ఇళ్లు ఇవ్వలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో ఎచ్చెర్ల మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో 3,256 మందికి ఇళ్లు మంజూరు చేశారు. స్థలం లేని వారికి సెంటున్నర స్థలాన్ని కూడా సమకూర్చారు. ప్రభుత్వ స్థలం లేనిచోట భూమిని కొనుగోలు చేసి మరీ స్థలాన్ని కేటాయించారు. కూటమి ప్రభుత్వంలో మాత్రం ఇప్పటికీ సెంటుభూమి కూడా ఇవ్వలేదు. సొంత స్థలం ఉన్నవారు దరఖాస్తు చేసుకుంటే ఇళ్లు మంజూరు చేస్తామనడంతో, ఇంటి స్థలాల కోసం, ఇళ్లు మంజూరు కోసం ఆన్‌లైన్‌లో 2,753 మంది ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నారు. వారికి కూడా ఇళ్లు మంజూరు చేయడం లేదు. వీరిలో అర్హులను ఎంపికచేయనున్నట్లు చెబుతున్నారు తప్ప కార్యరూపం దాల్చడం లేదు. దీంతో ఎంతమందికి ఇళ్లు మంజూరు చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఇక స్థలం లేని వారికి ఇంటి స్థలం ఇవ్వడం గురించి ఇంకా ప్రతిపాదనే రాలేదు. గత వైఎస్సార్ సీపీ హయాంలో ఒక్కొక్క ఇంటికీ రూ.1.80 లక్షల ఆర్థిక, మెటీరియల్ సహాయం అందించింది. దీంతో చాలా వరకు ఇళ్లు నిర్మించుకుని ఆనందంగా నివాసం ఉంటున్నారు. గత ప్రభుత్వం అధికారంలో ఉండగానే దాదాపు సగం ఇళ్లు పూర్తయ్యాయి. గత ఏడాది కాలంలో మాత్రం పూర్తిచేసినవాటితో మొత్తం 2,283 ఇళ్లు పూర్తయినట్లు అధికారిక సమాచారం. మిగతావి వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. వీటిని పూర్తి చేయడానికి ఎస్సీ, బీసీ, ఎస్టీలకు అదనంగా ఆర్థిక సహాయాన్ని అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు వివిధ నిర్మాణ దశల్లో ఇళ్లకు నాలుగు విడతలుగా అందివ్వనున్నారు. ఇళ్లను ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని, లేదంటే ఈ పథకం రద్దు చేయనున్నట్లు ప్రకటించింది. దీంతో గృహ నిర్మాణాల్లో కదలిక వచ్చింది. అయితే బిల్లలు చెల్లింపులు జరపడంలో జాప్యం చేస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు.

కొత్తవి మంజూరు కాలేదు..

కొత్త గృహాలు మంజూరు కాలేదు. సొంత స్థలాలు ఉన్నవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. వీరిలో అర్హులను ఎంపిక చేసి ఇళ్లు మంజూరు చేస్తారు. ఒక్కొక్క ఇంటికి అందించే ఆర్థిక సహాయాన్ని రూ.2.80 లక్షలకు పెంచుతున్నారు. గత ప్రభుత్వంలో మంజూరైన 3,256 ఇళ్లలో 2,283 పూర్తయ్యాయి. మిగిలనవి వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. వీటిని ఈ ఏడాది డిసెంబర్‌లోగా పూర్తి చేయాలని, లేదంటే రద్దవుతాయని నిర్దేశించారు.

– వి.మాలతి, హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈ, ఎచ్చెర్ల

జయజయ శుభకర వినాయక..



గుడివీధి ఉమారుద్ర కోటేశ్వర ఆలయంలో మహాగణపతి



బొంతావారివీధిలో గరికలతో గణపతికి అలంకరణ



చిత్తరంజన్ వీధిలోని గణపతి మండపం వద్ద మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు



జి సిగడాం: ఆంజనేయ యూత్ కమిటీ ఆధ్వర్యంలో పూజలు



బలగ మెట్టు వద్ద దీపారాధన

శ్రీకాకుళం కల్చరల్ : వినాయక నవరాత్రి ఉత్స వాలు ఘనంగా కొనసాగుతున్నాయి. నగరంలోని గుడివీధి ఉమారుద్ర కోటేశ్వరాలయంలో మహాగణపతి ఉత్సవాలలో భాగంగా ఆదివారం ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో అష్టోత్తర అర్చనలు జరిగాయి.

● బొంతావారివీధిలోని కృష్ణార్జున మందిరంలో ఆదివారం గరికలతో వినాయకునికి అర్చనలు జరిగాయి. అర్చకులు అనిల్‌శర్మ ఆధ్వర్యంలో సామూహిక అర్చనలు చేశారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు మిమిక్రీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న అమ్మన్నాయుడు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు మణికొండ ఆదినారాయణమూర్తి, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ – హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం శ్రీకాకుళం ఎన్‌జీఓ హోమ్‌లో నగర మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబరు 14న పాతపట్నంలో జరిగే అంగన్‌వాడీ వర్కర్స్ – హెల్పర్స్ యూనియన్ జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గత ఆరేళ్లలో నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, పనిభారం పెరిగిందని, తమకు మాత్రం ఒక్క రూపాయి వేతనం కూడా పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం తక్షణమే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ శ్రీకాకుళం నగర్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు మాట్లాడుతూ పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు.

నగర నూతన కమిటీ ఎన్నిక:

ప్రాజెక్టు కమిటీ గౌరవ అధ్యక్షురాలిగా కె.జ్యోతి, అధ్యక్షులుగా టి.రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శిగా కె.కళ్యాణి, ఉపాధ్యక్షులుగా పి.సంధ్యారాణి, కె.ఆదిలక్ష్మి, జి.పావని, సహాయ కార్యదర్శులుగా కె.పార్వతి, డి.ముత్యాలమ్మ, రమణమ్మ, మల్లీశ్వరి, అప్పలనర్సమ్మలతో పాటు 19 మందిని ఎన్నుకున్నారు.

వాడవాడలా అన్నదానాలు



రణస్థలం: అన్నసమారాధనలో గొర్లె కిరణ్‌కుమార్



గార: రామచంద్రాపురంలో అన్నదానం



పద్మావతినగర్ కాలనీలో అన్నప్రసాద వితరణ

రణస్థలం: రణస్థలంలోని గొర్లె వీధిలోనివరసిద్ధి వినాయక చవితి నవరాత్రులు సందర్భంగా ఆదివారం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ హాజరై స్వామి వారిని దర్శించుకుని భక్తులకు అన్న ప్రసాదాలు వడ్డించారు. కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షులు మజ్జి రమేష్, మహంతి గురునాయుడు, పసుపురెడ్డి సురేష్, మహంతి రమణ, అప్పలనాయుడు, చందక వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గార: వినాయక నవరాత్రులు పురస్కరించుకొని రామచంద్రాపురంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. గ్రామస్తులు, యువత ఆధ్వర్యంలో రెండు వేల మందికి అన్న ప్రసాదం అందజేశారు.

శ్రీకాకుళం కల్చరల్: ఎల్‌బీఎస్ కాలనీ వద్ద పద్మావతినగర్ కాలనీలో వినాయక ఉత్సవాలలో భాగంగా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీపెద్దలు సత్యనారాయణ, నాగేశ్వరరావు, శారద తదితరులు పాల్గొన్నారు.

త్రిశతి పఠనం సర్వపాప హరణం



గౌరీశంకర్‌ను సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: డాక్టర్ ఈశ్వర సీతారామ ధన్వంతరి ఆంధ్రీకరించిన త్రిశతి పఠనం సర్వపాప హరమని వక్త భమిడిపాటి గౌరీశంకర్ అన్నారు. నగరంలోని ఉపనిషన్మందిరంలో సాహిత్య గణపతి ఉత్సవాలలో భాగంగా 'లలితా త్రిశతి'పై ఆధ్యాత్మిక ప్రవచనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర అన్ని నామ స్తోత్రాల వల్ల కలిగే ఫలితం లలితా త్రిశతిలో ఒక్క నామ పఠనం వల్లే కలుగుతుందన్నారు. అనంతరం గౌరీశంకర్‌ను మందిరం సభ్యులతో కలిసి మహతి సాహితీ సంస్థ తరఫున డాక్టర్ సంపత్‌కుమార్ సత్కరించారు. కార్యక్రమంలో మందిరం అధ్యక్షుడు గుమ్మా నగేష్, నారాయణమూర్తి, నరసింహమూర్తి, నారాయణమూర్తి, కోమలరావు, వెంకటరమణ, చంద్రరావు, చాగంటి బాపయ్య, విశ్వేశ్వరరావు, ఉమారాణి, అనురాధ, సరస్వతి, మంగమ్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం



ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన శుద్ధ జల ప్లాంట్‌ను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (సుడా) సౌజన్యంతో రూ. 5 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ను సుడా చైర్మన్ కొరికాన రవికుమార్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అంబటి లక్ష్మీరాజ్యం, ఉంగటి రమణ, జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనారాయణ, శ్రీకాకుళం 1, 2 డిపోల మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కె.ఆర్.ఎస్.శర్మ, ఆర్టీసీ డీఈ (సివిల్) బమ్మిడి రవికుమార్, అసిస్టెంట్ మేనేజర్లు పి.సంతోష్‌కుమార్, ఎ.గంగరాజు, ఎస్‌ఎం ఎంపీ రావు, ఆర్టీసీ అధికారి ఎఎస్‌ఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాధాష్టమి పూజలు



ఇస్కాన్ మందిరంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ



రణస్థలం: నరసింహ స్వామి యాగంలో పాల్గొన్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్:

నగరానికి సమీపంలో ఉన్న పొన్నాడ బ్రిడ్జి వద్ద ఇస్కాన్ రాధా గోవింద మందిరంలో ఆదివారం రాధాష్టమి పూజలు ఘనంగా నిర్వహించారు. మందిరం ప్రతినిధి లక్ష్మీగౌర్‌దాస్ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది.

రణస్థలం: కోష్ట సమీపంలోని శ్రీ కృష్ణ చైతన్య మఠం గోసేవ ఆశ్రమంలో రాధా రాణి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. లోక సంక్షేమం కోసం నరసింహ స్వామి మహాయజ్ఞం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణుల విగ్రహ ప్రతిమలను ప్రత్యేక అలంకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రాధిక రామన ప్రభు మాట్లాడుతూ మఠంలో 350 గోవుల సంరక్షణకు కృషి చేస్తున్నామని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గార: తూలుగు సబ్‌స్టేషన్‌లో కొత్త 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంతో పాటు తూలుగు, బూరవిల్లి, సతివాడ, వత్సవలస, కొత్తూరు–షైరిగాం, కొర్ని, కొర్లాం, శాలిహుండం, పూసర్లపాడు, బోరవానిపేట పంచాయతీల్లో వాణిజ్య, గృహ, వ్యవసాయ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రక్తదానం మహాదానం



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

అరసవల్లి: రక్తదాతలు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమని రెడ్‌క్రాస్ చైర్మన్ పోలుమహంతి జగన్మోహనరావు అన్నారు. ఆదివారం నగరంలోని బొంపాడవీధి రామమందిరం వద్ద డాక్టర్ ఇంజరాపు మోహనరావు జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. మోహన్‌తో పాటు సుమారు 30 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, డాక్టర్ ఇంజరాపు జాహ్నవి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సకాలంలో ఎరువులు అందించాలి

జి.సిగడాం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులకు సకాలంలో ఎరువులను పంపిణీ చేయడంలో విఫలమయ్యారని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి అన్నారు. ఆదివారం విజయరాంపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బస్తా యూరియా కోసం రైతులు నానా పాట్లు పడుతున్నారని చెప్పారు. ఎన్నికల హామీలు పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు.

'బుడుమూరు'కు మద్దతు పలకండి



బెజ్జిపురం గ్రామపెద్దలతో బుడుమూరు గ్రామస్తులు

ఎచ్చెర్ల : లావేరు మండలం బుడుమూరును మండల కేంద్రంగా చేసేందుకు మద్దతు తెలియజేయాలని కోరుతూ గ్రామస్తులు ఆదివారం బెజ్జిపురం, అదపాక, తామాడ, నేతేరులక్ష్మీపురం తదితర పంచాయతీలకు వెళ్లి నాయకులను కలిశారు. ఇక్కడ వనరులు పుష్కలంగా ఉన్నాయని, అన్ని గ్రామాలకు మధ్యస్థంగా ఉన్నందున మండల కేంద్రం ఏర్పాటైతే బాగుంటుందని తెలిపారు. ఈ విషయమై ఎంపీ, ఎమ్మెల్యేలకు కూడా వినతిపత్రాలను అందజేశామన్నారు.

నాగేశ్వరశర్మకు అవార్డు

ఎచ్చెర్ల: అల్లినగరం గ్రామానికి చెందిన వాస్తు జ్యోతిష్య పండితుడు పట్నాల నాగేశ్వరశర్మకు ప్రతిభ జ్యోతిష్య రత్న అవార్డు లభించింది. విశాఖపట్నం ప్రతిభ క్రీడా సాంస్కృతిక సంస్థ 25వ వార్షికోత్సవ కళా సంబరాల సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధులు ఆదివారం ద్వారకనగర్ పౌర గ్రంథాలయంలో జ్ఞాపికను అందించి సన్మానించారు.

మహా లడ్డు @ రూ.2.86 లక్షలు



మహాలడ్డును అందిస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మొండేటివీధి లక్ష్మీగణపతి దేవాలయంలో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి మహాలడ్డు వేలాం వేయగా రూ.2.86లక్షలు పలికింది. నగరానికి చెందిన కోరాడ గోవింద్, శాసనపురి శ్రీనివాసరావు, బలభద్రుని కుమార్, శిల్లా ఉపేంద్ర, కర్రా భాస్కర్‌రావు, కర్రా మహేశ్వరరావు, శిల్లా చందు, మండవల్లి రవి, జామి నవీన్, కర్రా మధుసూదనరావు, కోరాడ శంకర్, అంధవరపు మణికంత, సంతోష్, అనిల్‌కుమార్, కొండలరావు, ఎన్.కిరణ్‌కుమార్, చక్రధరరావు, చంద్రశేఖరరావు, కె.జ్ఞాని, వి.రామరాజు, మణిదీప్‌లు కలిసి లడ్డూను దక్కించుకున్నారు. పగడాల హారం రూ.37వేలకు, ముత్యాలహారం రూ.34 వేలకు నగరానికి చెందిన కర్రా మధుసూదనరావు, కోరాడ శంకర్‌రావు, గుడ్ల కిషోర్, కింతలి కార్తీక్, అంధవరపు నగేష్, చౌదరి బాలాజి దక్కించుకున్నారు. మణిహారాన్ని రూ.37 వేలకు కిల్లంశెట్టి జ్ఞాని దక్కించుకున్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు, ఆలయ అర్చకులు భద్రం శ్రీనివాసాచార్యులు, బలరామాచార్యులు, సాయి మణికంత తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గణనాథుని నిమజ్జనోత్సవం



పొన్నాడ బ్రిడ్జి వద్ద సత్యం శివం సుందరం మందిరం వినాయక నిమజ్జనం



నాగావళి నదిలో నిమజ్జనం చేస్తూ..

శ్రీకాకుళం కల్చరల్: నగరంలో వినాయక విగ్రహాల ఊరేగింపులు, అనుపోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కంపోస్టు కాలనీలో చిన్నారులు గణపతిని ఊరేగింపుగా తీసుకువెళ్లి నాగావళి నదిలో నిమజ్జనం చేశారు. నక్కవీధి వద్ద గుడారివీధిలో యువకుల నృత్యాలు చేస్తూ సందడి చేశారు. సత్యం శివం సుందరం సత్యసాయి మందిరం ఆధ్వర్యంలో పూజలందుకున్న వినాయకుని మేళతాళాల నడుమ ఊరేగింపు చేపట్టారు. పొన్నాడ బ్రిడ్జి, పాత బ్రిడ్జి వద్ద క్రేన్‌లు ఏర్పాటు చేయగా.. ఉమారుద్ర కోటేశ్వర స్వామి ఆలయం రేవు వద్ద ప్రత్యేక రక్షణ ఏర్పాట్ల నడుమ గణనాథుల నిమజ్జనం జరిగింది.

ఆగని డీజే మోత



డీజే సౌండ్ సిస్టమ్ వద్ద యువత నృత్యాలు

శ్రీకాకుళం: నగరంలో డీజే మోత మోగుతోంది. డిజేను నిషేధం, ముందస్తు అనుమతులపై పోలీసులు ప్రకటన విడుదల చేసినప్పటికీ యువత ఏమాత్రం పట్టించుకోవడం లేదు. వినాయక ఉత్సవాల ఊరేగింపులో భాగంగా డీజే సౌండ్ సిస్టమ్ యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. డీజే నుంచి వెలువడే శబ్ద కాలుష్యం వల్ల తక్షణంగానీ భవిష్యత్తులో గానీ అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉన్నా యువత పెడచెవిన పెడుతున్నారు. డీజే శబ్దానికి తట్టుకోలేక జిల్లాలో పలువురు మృత్యువాత పడిన ఘటనలు ఇటీవల కాలంలో చోటుచేసుకున్నాయి. మితిమీరిన శబ్దం వల్ల మెదడు, గుండె, చెవులుతోపాటు మరి కొన్ని అవయవాలు దెబ్బతింటాయని వైద్య నిపుణులు సైతం హెచ్చరిస్తున్నారు. అయినా యువత వినకపోవడం గమనార్హం.